క్లుప్తంగా

కోహీర్ తహసీల్దార్‌గా శాంతకుమారి

కోహీర్(జహీరాబాద్): కోహీర్ తహసీల్దార్‌గా శాంతకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి కలెక్టరేట్ రెవెన్యూ విభాగంలో పనిచేసిన ఆమె ఇక్కడికి బదిలీపై వచ్చారు. కోహీర్ తహసీల్దార్ విజకుమార్ వికారాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

బాధ్యతల స్వీకరణ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం తహశీల్దార్‌గా సరిత బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహశీల్దార్ జయరాం బదిలీపై వికారాబాద్ జిల్లాకు వెళ్లారు.

'సొంత భవనాలు నిర్మించాలి'

నారాయణఖేడ్: మైనార్టీ, బీసీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవల్లి రమేశ్ డిమాండ్ చేశారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు కంగ్టి నుంచి ప్రారంభమైన మోటార్ సైకిల్‌యాత్ర బుధవారం నారాయణఖేడ్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా సాంఘీక సంక్షేమ గురుకులంలో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో రమేశ్ మాట్లాడుతూ కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఆ తరువాత విద్యారంగ అభివృద్ధిని గాలికొదిలేశారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సతీష్, కొటారీ నర్సింహులు, అరుణ్, డివిజన్ అధ్యక్షుడు స్వరాజ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లి, బోడపల్లి గ్రామాల్లో రూ.25లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను జెడ్పీటీసీ మీనాక్షి స్థానిక నాయకులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సహకారంతో ప్రతి గ్రామంలో సీసీ రోడ్డు పనులను చేపడుతున్నట్టు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రయ్య, మన్‌సాన్‌పల్లి ఉపసర్పంచ్ నర్సమ్మ, బోడపల్లి సర్పంచ్ బిందేశ్వరి, మునిపల్లి సర్పంచ్ రమేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, రైతుబంధు మండల అధ్యక్షుడు పరశురాంగౌడ్ పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం క్విట్ ఇండియా నినాదం

నారాయణఖేడ్: యువతకు ఆదర్శం క్విట్ ఇండియా నినాదమని డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో గిరిజన, క్విట్ ఇండియా, యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా చౌరస్తా వద్ద క్విట్ ఇండియా, యువజన కాంగ్రెస్ జెండాలను ఆవిష్కరించారు. ఖేడ్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు నద్దాం, రాజేశ్‌చౌహాన్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, నాయకులు షాదుల్, పండరిరెడ్డి, గుండేరావ్, శ్రీకాంత్ రెడ్డి, దీపక్‌రెడ్డి పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

జహీరాబాద్ టౌన్: యువజన కాంగ్రెస్ 63వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజునాయక్, నాయకులు జహీర్ అరబీ, రవి చవాన్, కృష్ణ, ఖలీం, ప్రశాంత్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిందని పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమ, మంగళవారంలో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో ఏడుగురిని గుర్తించి సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమానా విధించినట్టు తెలిపారు.

'గృహలక్ష్మి'కి తిప్పలు

వట్‌పల్లి(అందోల్): గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు బుధవారం స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మీ–సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న తర్వాత కుల, ఆదాయ ధ్రువపత్రాలు తీసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా ఒక్కసారిగా కంప్యూటర్ సర్వర్ డౌన్ కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వచ్చింది. మధ్యాహ్నం తరువాత సర్వర్ పనిచేయడంతో దరఖాస్తుదారులు ఒక్కసారిగా ఎగబడ్డారు. గృహలక్ష్మి కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఒకేరోజు గడువు ఉండడంతో సమయానికి ధ్రువపత్రాలు అందుతాయో లేవోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై డిప్యూటీ తహసీల్దారు వివరణ కోరగా సర్వర్ సమస్యతో ధ్రువపత్రాల జారీలో ఆలస్యమవుతుందని, ధ్రువపత్రాలను జారీ చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పటాన్‌చెరు: డివిజన్‌లో పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని ముదిరాజ్ శ్మశానవాటికలో చెట్ల వ్యర్థాలు, ఇళ్ల కూల్చివేత వ్యర్థాలు పేరుకుపోవడంతో బుధవారం మున్సిపాల్ సిబ్బందితో తొలగింపజేశారు.

బీఆర్ఎస్‌తోనే గిరిజనుల అభివృద్ధి


మాట్లాడుతున్న చింతా ప్రభాకర్

- బీఆర్ఎస్ నేత చింతా ప్రభాకర్
- ఘనంగా ప్రపంచ గిరిజన దినోత్సవం

సంగారెడ్డి అర్బన్: బీఆర్ఎస్‌తోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ నేత, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ప్రపంచ గిరిజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ గిరిజనులు కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగాలని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంత్ తపస్వీ రామ్‌రావు మహారాజ్ విగ్రహం ఏర్పాటుకు సంగారెడ్డిలో స్థలం కేటాయిస్తామని హామీనిచ్చారు. అనంతరం సంగారెడ్డి పట్టణం ఐబీ నుంచి జడ్పీ కార్యాలయం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుర్ర సత్యనారాయణ, ఉమ్మడి మెదక్ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్, జెడ్పీటీసీ రాజు రాథోడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలి

జహీరాబాద్ టౌన్: గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ బంజార ఎంప్లాయిస్ సేవా సంఘం(టీబెస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసిరాం రాథోడ్ అన్నారు. టీబెస్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ప్రపంచ గిరిజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీబెస్ నాయకులు తుకారాం చవాన్, హన్మంత్ పవార్, అర్జున్ చవాన్, దేవిసింగ్ రాథోడ్, రమేష్ బాణోత్, సుభాష్ రాథోడ్, నానుసింగ్, దశరత్ పవార్, లాల్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి

నారాయణఖేడ్: గిరిజన తండాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు రాందాస్‌నాయక్ అన్నారు. అంతర్జాతీయ గిరిజన దినోత్సవం సందర్భంగా బుధవారం ఖేడ్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజనుల కోసం గిరిజన బంధు పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సేవాలాల్ మహారాజ్ జయంతి, గిరిజన దినోత్సవాలకు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ నాయక్, ప్రకాశ్‌రాథోడ్, జిల్లా ఉపాధ్యక్షుడు సురేశ్‌నాయక్, నాయకులు శ్రీనివాస్‌నాయక్, వినోద్, శ్రీరాం, నగేశ్, విఠల్, ప్రేమ్ పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

బీసీ బంధు చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: మనూరు మండల పరిధిలోని బాదల్‌గాం, కంగ్టి మండలంలోని దెగుల్‌వాడ గ్రామానికి చెందిన పలువురికి బీసీ బంధు చెక్కులను ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో దెగుల్‌వాడ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ గోవిందరెడ్డి, బాదల్‌గాం సర్పంచ్ మాలిపటేల్ నాగప్ప పాటిల్, సంతోష్ పాటిల్ పాల్గొన్నారు.

ఏడు నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటు

నారాయణఖేడ్: నియోజకవర్గంలో ఏడు నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు. శంకరంపేట(ఎ) మండలంలోని మల్కాపూర్ పంచాయతీ నుంచి గట్టు తండా, నారాయణఖేడ్ మండలంలోని కొండాపూర్ పంచాయతీ నుంచి హనుమాన్ మందిర్‌తండా, మాద్వార్ పంచాయతీ నుంచి లింగనాయక్‌పల్లి, నమ్లిమేట్ పంచాయతీ నుంచి గుండుతండా, సిర్గాపూర్ పంచాయతీ నుంచి పాత్యానాయక్ తండా, నాగల్‌గిద్ద మండలంలోని ఇరక్‌పల్లి పంచాయతీ నుంచి ఉమ్లి తండా, నాగల్‌గిద్ద పంచాయతీ నుంచి శామానాయక్ తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసిందన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండల పరిధిలోని వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆత్మ కమిటీ డైరెక్టర్ నాగొశెట్టి, మావినెల్లి సర్పంచ్ విఠల్‌రావు, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు లక్ష్మణ్, మండల సోషల్ మీడియా అధ్యక్షుడు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రాంరావు మహారాజ్ స్మృతి వనానికి 20 గుంటల స్థలం కేటాయింపు

ఆదివాసి గిరిజన దినోత్సవం సందర్భంగా రాంరావు మహారాజ్ స్మృతి వనానికి ప్రభుత్వం 20 గుంటల భూమిని కేటాయించిందని ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి స్థల కేటాయింపు పత్రాలను గిరిజన నాయకులకు అందజేశారు. రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

తారా కళాశాలలో హరితహారం


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

కొండాపూర్(సంగారెడ్డి): సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు మేరి మట్టి–మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ అధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. న్యాల్‌కల్ ఎస్‌బీఐ మేనేజర్ విశ్వేశ్వర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమలు ఏర్పాటు చేయాలని వినతి

జహీరాబాద్: ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్‌ను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జగన్నాథ్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ప్రాంతంలో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. పరిశ్రమల ఏర్పాటుకు జహీరాబాద్ ప్రాంతం అనుకూలంగా ఉందని, ఈ విషయాన్ని పరిశీలించి పరిశ్రమల ఏర్పాటుకు పాటు పడాలని మంత్రిని కోరినట్లు జగన్నాథ్ పేర్కొన్నారు.


కేంద్ర మంత్రి మహేంద్రనాథ్‌తో జగన్నాథ్

సర్వాయి పాపన్న కృషి మరువలేనిది


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శివకుమార్, నాయకులు

జహీరాబాద్: సర్దార్ సర్వాయి పాపన్న సామాజిక చైతన్యం కోసం చేసిన కృషి మరువలేనిదని జై గౌడ్ ఉద్యమ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్ అన్నారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని శ్రీనివాస్ మహల్‌లో అమరవీరుల యాదిలో సామాజిక చైతన్యయాత్ర సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈ నెల 13వ తేదీన సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. 18వ తేదీ వరకు జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వాల్‌పోస్టర్లను డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రమేష్‌గౌడ్, స్వప్న, విఠల్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మాణయ్యగౌడ్, దిగ్వాల్ శ్రీనివాస్‌గౌడ్, రంగన్నగౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ప్రభాకర్(ఫైల్)

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన నందికంది గ్రామ శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మంగళి ప్రభాకర్(22) ప్రవేట్ పరిశ్రమలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యక్తిగత పనులపై సంగారెడ్డికి ద్విచక్ర వాహనంపై వెళ్లి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో నందికంది గ్రామ శివారులోకి రాగానే ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. ప్రభాకర్ మృతితో గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి.

కేజీబీవీ పాఠశాలలో బాలికల చేరిక


పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ అంజయ్య

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో ఇద్దరు బాలికలను ఎంఈఓ అంజయ్య చేర్పించి హాస్టల్ వసతి, పాఠ్య పుస్తకాలు, దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఝరాసంఘం మండలం ఈదులపల్లి గ్రామానికి చెందిన అక్షర, సదాశివపేట మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన గొండ్ల అక్షయ చదువు మానేసి ఇంటి వద్దనే పనిచేస్తున్నారన్నారు. దీంతో తల్లిదండ్రులకు చదువు విలువను వివరించి కేజీబీవీలో చేర్పించినట్టు తెలిపారు. కంబాలపల్లి సర్పంచ్ శ్రీహరి, కేజీబీవీ ఎస్‌ఓ లలిత, సీఆర్పీ రాజేశ్వర్, సీఆర్పీలు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతివనం పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామంలోని పల్లె ప్రకృతివనాన్ని సేట్రీస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలుష్య ప్రాంతాల్లో మొక్కలను రక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వారు అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రకాశ్‌చారి మాట్లాడుతూ సేట్రీస్ సంస్థ మొక్కలను రక్షించేందుకు ముందుకు రావటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సాయికిశోర్, ప్రతినిధిదుర్గేష్, వార్డుసభ్యులు వీరేశంగౌడ్, విజయలక్ష్మి, రాములు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

మునిపల్లి(అందోల్): కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎండీ ఖమ్రోద్దీన్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల పరిధిలోని ఆయా పాఠశాలలో టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అశోక్, మండల అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి గోపాల్, నాయకులు గోవర్ధన్, గీతామాలిని, ముజాఫర్, నవీన్, అమినోద్దీన్, శరణ్, సాయిలు, సంగమని తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

జహీరాబాద్ టౌన్: మండలంలోని హుగ్గెల్లి గ్రామ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు, పీడీఎస్‌యూ నాయకులు బుధవారం ఎంపీపీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ గ్రామంలోని పలు వార్డుల్లో వారం రోజుల నుంచి మంచి నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. 5వ వార్డులో బోరు చెడిపోయి ఆరు నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేయడంలేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ సుమతికి వినతిపత్రం అందజేశారు.

సంక్షిప్త వార్తలు

◆ అల్గోల్‌లో గడప గడపకు కాంగ్రెస్

జహీరాబాద్: మండలంలోని అల్గోల్ గ్రామంలో బుధవారం యువజన కాంగ్రెస్ మండల నాయకులు గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి మోహన్, నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ గొడుగుల పంపిణీ

సంగారెడ్డి టౌన్: వాసవి మా ఇల్లు సంస్థ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని పాత బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం జ్యోతిర్ వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వరశర్మ సిద్ధాంతి చేతుల మీదుగా బుధవారం వీధి వ్యాపారులకు గొడుగులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి పుల్లూరి ప్రకాష్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మ్యాడం రాధా కిషన్, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

◆ కులవృత్తిదారుల సంక్షేమానికి కృషి

కొండాపూర్(సంగారెడ్డి): కులవృత్తిదారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని డీసీసీబీ వైస్‌చైర్మన్ పట్నం మాణిక్యం అన్నారు. బుధవారం గొర్రెల పంపిణీ రెండో విడతలో భాగంగా మండల పరిధిలోని తొగర్‌పల్లిలో లబ్ధిదారులకు 8 యూనిట్‌ల గొర్రెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మనోజ్‌రెడ్డి, వీఎల్ఓ వెంకటరమణారెడ్డి, కురుమ సంఘం మండల అధ్యక్షుడు జలేందర్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ప్రేమానందం పాల్గొన్నారు.

◆ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఝరాసంగం(జహీరాబాద్): వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని ఎస్ఐ రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కృష్ణాపూర్ గ్రామ శివారులోని కమాన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ 2 కృష్ణగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

◆ ఆర్డీఓకు వినతి

జహీరాబాద్: జహీరాబాద్, అల్లీపూర్, హోతి(కె) గ్రామాల శివారు రోడ్డును కొందరు ఫోర్జరీ పత్రాలు సృష్టించి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని నాయకులు అబ్దుల్ సలీమ్ తదితరులు బుధవారం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ఉన్న శివారు రహదారిని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి విచారణ జరిపించాలని కోరారు. పట్టణంలో ఇప్పటికే పలు స్థలాలు కబ్జాకు గురయ్యాయని తెలిపారు.

◆ బస్ సర్వీస్ కల్పించడం అభినందనీయం

సదాశివపేట(సంగారెడ్డి): సంగారెడ్డి సమీపంలోని ఎంఎన్ఆర్ ఆస్పత్రిలో ఉచిత వైద్య సేవల గురించి సదాశివపేట పట్టణం నుంచి ఎంఎన్ఆర్ అస్పత్రి వరకు ఉచితంగా బస్ సౌకర్యం కల్పించడం అభినందనీయమని మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఎన్ఆర్ ఆస్పత్రి సీనియర్ మేనేజర్ చక్రవర్తి, బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు చింతా సాయినాథ్, నాయకులు పాల్గొన్నారు.

◆ బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

కోహీర్(జహీరాబాద్): పోగొట్టుకొన్న సెల్‌ఫోన్‌ను కోహీర్ పోలీసులు బుధవారం బాధితునికి అప్పగించారు. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం కోహీర్ పట్టణ నివాసి వహీద్ గత ఏప్రిల్ నెలలో రూ. 20వేల విలువగల సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ సాంకేతికత సహాయంతో అల్లాదుర్గం మండలంలోని రెడ్డిపల్లిలో ఓ వ్యక్తి వద్ద సెల్‌ఫోన్ ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం బాధితుడు వహీద్‌కు ఫోన్‌ను అప్పగించామని తెలిపారు.

◆ అర్హులకు దళితబంధు ఇవ్వాలి

వట్‌పల్లి(అందోల్): అర్హులందరికీ దళితబంధు పథకం వర్తింపజేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్‌జోషి డిమాండ్ చేశారు. బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జగదీశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు రాఘవేందర్, విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ అశోక్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ విఠల్, నాయకులు కమార్‌రావు, వెంకట్‌రావు, రమేశ్, సుధాకర్, యువజన విభాగం నాయకులు ప్రవీణ్‌గౌడ్, సురేష్, మల్లేశం పాల్గొన్నారు.

◆ సమయపాలన పాటించని అధికారులతో ఇబ్బందులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదలలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు సమయ పాలన పాటించటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉదయం 10.30గంటలు అవుతున్నా అధికారులు, సిబ్బంది కార్యాలయానికి రావడంలేదని, ఈ విషయమై ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను ప్రశ్నిస్తే దురుసుగా సమాధానం ఇస్తున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. కార్యాలయానికి వచ్చి అధికారుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, అధికారులు సమయ పాలన పాటిస్తూ తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

◆ హర్ ఘర్ తిరంగా ర్యాలీ

సంగారెడ్డి అర్బన్: హర్ ఘర్ తిరంగా 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం పోస్టల్ విభాగం ఆధ్వర్యంలో సంగారెడ్డిలో చేపట్టిన బైక్ ర్యాలీ విజయవంతంగా కొనసాగింది. కార్యక్రమంలో పోస్టల్ ఎస్పీ ఎల్‌వి మురళికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

◆ బీఆర్ఎస్‌లో చేరిక

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని బ్రాహ్మణగుడ గ్రామ సర్పంచ్ తిమ్మాపురం మొగులయ్యతో పాటు వార్డుసభ్యులు శ్రీనివాస్, గణేష్, రమేష్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమక్షంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింలు, జెడ్పీటీసీ ఆంజనేయులు, పార్టీ మండల శాఖ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సంగారెడ్డి టౌన్: రేషన్ డీలర్లకు కమిషన్లు పెంచినందుకు గాను బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి రేషన్ డీలర్లు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు, రేషన్ డీలర్లు స్థానిక నాయకులు పాల్గొన్నారు.